క్లుప్తంగా


ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



జేసీ డాక్టర్ బి.నవ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని గోకారి కాలనీ, పరిదెంపాడు గ్రామ వాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నగర కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం వారు జేసీ డాక్టర్ బి.నవ్యను ఆమె కార్యాలయంలో కలిసి ఇళ్ల పట్టాల కోసం విన్నవించారు. నగర శివారులోని జొహరాపురం సమీపంలో గోకారి కాలనీలో మూడు సంవత్సరాలుగా 100 కుటుంబాలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నాయన్నారు. అలాగే పరిదెంపాడులో 30 ఏళ్ల నుంచి 200 మంది పేదలు ఇళ్ల పట్టాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఆయా కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కె.భాస్కర్, నాయకులు రాజు, మౌలాబీ, రాము తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణ భగవానుడు

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత పొందవచ్చని ప్రముఖ ధార్మిక ప్రవచకులు విశ్వనాథ గురూజీ అన్నారు. ఉత్పన్న ఏకాదశి పురస్కరించుకొని గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. అంతకు ముందు శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ మాట్లాడుతూ.. ధార్మిక చింతనకు ప్రతి రోజూ కొంత సమయం కేటాయించాలన్నారు. సంఘం సభ్యులు ఇల్లూరు రమణ, సింహాద్రి రమేష్, మహాబలేశ్వర్, ధార్మిక సంస్థల ప్రతినిధులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



అనుగ్రహ భాషణం చేస్తున్న త్రిదండి రామానుజ జీయర్‌స్వామి

కర్నూలు కల్చరల్: హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని మైసూరు మేల్కోట తిరునారాయణ క్షేత్రం 41వ పీఠాధిపతి త్రిదండి రామానుజ జీయర్‌స్వామి అన్నారు. మంగళవారం కర్నూలు గోదా గోకులం వచ్చిన ఆయన రంగనాథ స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. భక్తులకు మంగళా శాసనంతో అనుగ్రహ భాషణం చేశారు. ఆలయాలను సందర్శిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సనాతన ధర్మం, సంస్కృతి సంప్రదాయాలను భావిత తరాలకు అందించాలన్నారు. గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, సభ్యులు బాల సుధాకర్, పాలాది సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతి



వనభోజన మహోత్సవంలో నాయీబ్రాహ్మణులు

కర్నూలు (అర్బన్): నాయీ బ్రాహ్మణులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కన్వీనర్ స్వామిచంద్రుడు సూచించారు. మంగళవారం స్థానిక వెంగన్న బావి సమీపంలో సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ అధ్యాపకులు వెంకటేశ్వర్లు, ఎస్‌పీ మద్దయ్య హాజరయ్యారు. సేవా సంఘ పొదుపు సంస్థ కార్యకర్తలు 35 మందికి వెండి బిల్లలను అధ్యక్షుడు ఈశ్వరయ్య బహుమతిగా అందించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన 40 మందికి పుస్తకాలను ప్రధాన కార్యదర్శి మల్లికార్జున చేతుల మీదుగా అందించారు. నీట్‌లో సత్తా చాటి విశ్వభారతి మెడికల్ కళాశాలలో సీటు సాధించిన మమతకు రూ.8 వేలు విలువ చేసే పుస్తకాలను, అలాగే విద్యార్థులకు రూ.30 వేలు విలువ చేసే పుస్తకాలు, బ్యాగులను అందించారు. ప్రముఖ నాదస్వర డోలు కచేరి బృందం తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నారుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సంఘం పెద్దలు మునిస్వామి, మంగయ్య, కింగ్స్ ప్రసాద్, అడ్వకేట్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తి.. చైతన్య దీప్తి

- ఘనంగా 75 వసంతాల రాజ్యాంగ పండుగ
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళులు
- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిజ్ఞ



మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో దీప్తి, చిత్రంలో కమిషనర్ రవీంద్రబాబు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ, పోలీసు సిబ్బంది

కర్నూలు(అర్బన్): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి అధికారులు, వివిధ ప్రజా, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి పాత కంట్రోల్ రూమ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు ప్రారంభించిన ఈ ర్యాలీలో డీఎస్‌డీఓ భూపతిరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మిదేవి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్.సబీహాపర్వీన్ తదితరులు పాల్గొన్నారు. కమిషనర్ రవీంద్రబాబు రాజ్యాంగ దినోత్సవ ప్రాధాన్యతను వివరించి ప్రతిజ్ఞ చేయించారు.

➤ జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ జీ.నాసరరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

➤ నేషనల్ లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు వై.జయరాజు అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ లిఖిత రాజ్యాంగాన్ని అందించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. న్యాయవాదులు చిన్నయ్య, రవికాంత్‌ప్రసాద్, పాపారావు, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

➤ మాల మహానాడు కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు యాట ఓబులేసు మాట్లాడుతూ.. భారతదేశంలో ప్రతి పౌరునికి స్వేచ్ఛ, సమానత్వం, హక్కులు కల్పించే విధంగా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎన్.నవీన్, యువ నాయకులు శ్యాంప్రసాద్, అనీల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

➤ సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో జేడీ జే.రంగలక్ష్మిదేవి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించి, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

➤ జెడ్పీ ప్రాంగణంలోని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పీఆర్ ఎస్ఈ ఎస్.రామచంద్రారెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు.పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వీ.రవీంద్రారెడ్డి, ఈఈ ఎస్ మద్దన్న, డీఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

➤ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాకర్ల శాంతికుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లోని ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ అంబేడ్కర్ ఎన్నో త్యాగాలు చేసి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు కష్టపడి ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. వసతి గృహ సంక్షేమ అధికారులు జి.సుంకన్న, మదారి, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): యువజన సర్వీసుల శాఖ-సెట్కూరు, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఓల్డ్ కంట్రోల్ రూమ్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, సెట్కూరు సీఈఓ దీప్తి మాట్లాడుతూ 1949 నవంబర్ 26న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సారథ్యంలో రూపొందిన రాజ్యాంగ ముసాయిదాను భారత ప్రభుత్వం ఆమోదించిందన్నారు.

➤ కర్నూలు మెడికల్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను, బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. విద్యార్థులచే రాజ్యాంగ పీఠికను పఠనం చేయించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయానందబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

కర్నూలు: భారత రాజ్యాంగం ఆమోదించబడి నేటికి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డీపీఓ మైదానంలో రాజ్యాంగ రూపకర్త బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జి.హుసేన్ పీరా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో రాజ్యాంగ పీఠికను చదివి వినిపించి ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, నారాయణ, జావెద్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: ప్రపంచ దేశాలకు తలమానికంగా భారత రాజ్యాంగం నిలుస్తోందని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్‌నాయుడు, ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, ఆచార్య పి.వి.సుందరానంద్ రాజ్యాంగ గొప్పతనాన్ని వివరించారు.

➤ డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీలో ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ పి.ఎస్.షా.వలి ఖాన్ విద్యార్థుల చేత రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేయించారు. భారత రాజ్యాంగం - సవాళ్లు అనే అంశంపై ఆన్‌లైన్ ద్వారా హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ న్యాయశాఖ డీన్ ప్రొఫెసర్ గాలటి వినోద్‌కుమార్ గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. వ్యాసరచన, వకృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

➤ జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో కార్యదర్శి కె.ప్రకాష్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉద్యోగులు, పాఠకులతో రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

➤ రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని డీఈఓ శామ్యూల్‌పాల్ అన్నారు. నగర శివారులోని రాఘవేంద్ర బీఈడీ కళాశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన మంగళవారం సందర్శించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. సమగ్ర శిక్ష సహాయ పర్యవేక్షణాధికారి డాక్టర్ షేక్ రఫీ, నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష సహాయ పర్యవేక్షణాధికారి యూనస్‌బాషా, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్నూలు (లీగల్): కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, బీఎస్ రవికాంత్ ప్రసాద్ మాట్లాడుతూ న్యాయవాదులు సమాజంలోని ప్రజల పక్షాన ఉండి అధికారులు రాజ్యాంగ పరిధిలో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. న్యాయవాది జయరాజ్ మాట్లాడుతూ.. దేశంలోని రాజకీయ పార్టీలు రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ నామమాత్రంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుతున్నాయని, న్యాయవాదులందరూ రాజ్యాంగాన్ని ప్రజలకు తెలియజేసి వారి పక్షాన నిలబడాలన్నారు. కార్యక్రమంలో జి.నాగేషయ్య, నాగేంద్రనాథ్ యాదవ్, సువర్ణరెడ్డి, రాజేష్, డేవిడ్, ఎం.నిత్యజీవన్ రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



నివాళులర్పిస్తున్న కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు



నివాళులర్పిస్తున్న డీఈఓ శామ్యూల్ పాల్



ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ సీఈఓ జీ.నాసరరెడ్డి



ఆర్‌యూలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్, ఉద్యోగులు

ఫీజు రీయింబర్స్‌మెంటు ఇంకెప్పుడు చినబాబూ?

- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రశ్న
- యాజమాన్యాలు ఫీజులు కట్టాలంటూ లెటర్లు రాయించుకుంటున్నాయి
- విద్యార్థుల ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి పట్టదా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో అన్ని వర్గాల విద్యార్థులు ఆందోళనలో ఉన్నారు. మరోవైపు పాఠశాలలు, కళాశాలల యజమాన్యాలు ఫీజులు కట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నాయి. విద్యార్థులతో లెటర్లు రాయించుకొని పరీక్షలకు అనుమతిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. ఇవన్నీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. మంగళవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు ఫీజు రియాంబర్స్‌మెంటు, అమ్మ ఒడి నిధులు సక్రమంగా అందేవని, ఇప్పుడా పరిస్థితి లేదని చెప్పారు. మాజీ సీఎం జగనన్న హయాంలో విద్యారంగానికి రూ.73 వేల కోట్లు కేటాయించారని, అమ్మఒడికి రూ.26 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్‌మెంటుకు రూ.12 వేల కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. నాడు-నేడు కింద రాష్ట్రంలోని 60 శాతం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారని కొనియాడారు. ఐదేళ్ల జగనన్న పాలనలో ప్రజా సంక్షేమానికి 2.75 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఎన్నికల ముందు పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకున్నది టీడీపీ కాదా? అని ప్రశ్నించారు. ఎన్నికల తరువాత పెండింగ్ నిధులు ఇస్తామని ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తీసుకున్న విషయం ఈ ప్రభుత్వానికి తెలియదా? అని నిలదీశారు. రాష్ట్ర అప్పు 14 లక్షల కోట్లు అని పదే పదే చెప్పిన టీడీపీ ప్రభుత్వం బడ్జెట్‌లో అప్పు రూ.6 లక్షల కోట్లుగా ఎందుకు చూపిందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో విద్యకు ఎంత బడ్జెట్ కేటాయించారో చెప్పలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని విమర్శించారు. ప్రజలను మోసం చేసి కూటమి ప్రభుత్వం గెలిచిందని, ఈ విషయం ఇప్పటికే ప్రజలకు అర్థమైందన్నారు. కూటమి పాలనలో పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోలేక రోడ్డున పడే పరిస్థితులు దాపురించాయని, ఇంగ్లిష్ మీడియం విద్యను సర్వనాశనం చేశారన్నారు. బైజూస్ కంటెంట్, ఐబీ కరిక్యూలమ్, డిజిటల్ లైబ్రరీలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

స్త్రీ, పురుషులు సమానమే

కర్నూలు(రూరల్): స్త్రీ, పురుషులు సమానమేనని, తేడాలు తగవని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గార్గేయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలపై వేధింపులను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు.

ఆకతాయిల ఆగడాలను అరికట్టండి

కర్నూలు: కర్నూలు శివారు ప్రాంతాల్లో కొందరు ఆకతాయిలు బైక్ సైలెన్సర్లు తొలగించి, అధిక శబ్దంతో ఓవర్ స్పీడ్‌గా వెళుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, మహిళా కళాశాలల వద్ద ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నారని, పోలీసులను అప్రమత్తం చేసి వారి ఆగడాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ సురేంద్ర మంత్రి టీజీ భరత్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఛాంబర్‌లో మంత్రిని కలసి వినతిపత్రం సమర్పించారు. ట్రాఫిక్ సమస్యలు, మహిళా సమస్యలపై ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక వాట్సాప్ నంబర్లు ఏర్పాటు చేయించాలని కోరారు.

డ్రగ్స్‌ను సమూలంగా అరికట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు(సెంట్రల్): విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల నివారణకు కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఆ కమిటీల ద్వారా మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలు, అనారోగ్యం, నివారణకు పోలీసులకు సమాచారం ఇచ్చేలా తయారు చేయాలని డీఈఓ, ఆర్ఐఓ, యూనివర్సిటీ, మెడికల్ కళాశాలల అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డ్రగ్స్ నియంత్రణపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిరప, జొన్న పైర్లలో అంతరంగా గంజాయి సాగు చేస్తుంటారని, తనిఖీలకు వెళ్లిన సమయంలో ఎక్కడైనా గంజాయి కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వ్యవసాయాధికారులకు సూచించారు. కొండ ప్రాంతాల్లో గంజాయి సాగుతోపాటు నాటుసారా కాచే అవకాశం ఉండడంతో వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖను ఆదేశించారు. ఎన్నికల సమయంలో తీసుకునే చర్యల్లాగే కర్ణాటక, తెలంగాణ నుంచి వచ్చే బస్సులు, ఇతర వాహనాలను నిరంతరం తనిఖీ చేయాలని, అక్రమంగా మద్యం, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు తరలిస్తే పట్టుకొని కేసులు నమోదు చేయాలన్నారు. తండాలపై నిఘా ఉంచి బెల్టు షాపులు ఉంటే ధ్వంసం చేయాలని పోలీసులు, ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ.. కౌతాళం మండలం రౌడూరులో 182 గంజాయి మొక్కలను అంతర పంటగా సాగుచేసిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 30 ప్రభుత్వ, 44 ప్రైవేట్ కళాశాలల్లో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతోపాటు హోర్డింగులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులపై కూడా నిఘా ఉంచినట్లు చెప్పారు. అంతకముందు జిల్లా ఎస్పీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో మత్తు పదార్థాల నివారణకు తీసుకున్న చర్యలను వివరించారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీటీసీ శాంతకుమారి, కార్మిక శాఖ అధికారి సాంబశివరావు, జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మీ, ఆర్ఐఓ గురువయ్య శెట్టి, డీఈఓ శామ్యూల్‌పాల్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి, ఔషధ నియంత్రణ ఏడీ రమాదేవి, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలు ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మంగళవారం పంచలింగాల గ్రామంలోని జిల్లా జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో మాట్లాడారు. ఖైదీలకు ఉచిత న్యాయ సేవల గురించి తెలియజేశారు. ఖైదీలు జైలు నుంచి విడుదలైన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, జిల్లా జైలు సూపరింటెండెంట్ బి.చంద్రశేఖర్ ఉన్నారు.

ప్రతి పేదవాడికి ఉచిత న్యాయం అందాలి

కర్నూలు (లీగల్): స్థానిక ప్రసూనా లా కాలేజీలో వరకట్న వ్యతిరేక దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ ప్రతి న్యాయ విద్యార్థి విధి అని, రాజ్యాంగ హక్కులే గాక బాధ్యతలు కూడా గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి పేదవాడికి ఉచిత న్యాయం అందించడంలో భాగస్వాములు కావాలని, వరకట్న నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ పీఠికను స్మరించారు. శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, ప్రిన్సిపాల్ శివాజీరావు, డీన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



పాతబస్తీలో ట్రాఫిక్ నియంత్రణపై అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలోని పాతబస్తీలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. మంగళవారం మున్సిపల్ అధికారులతో కలిసి పాతబస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పాతబస్తీలో ఇరుకైన రహదారుల వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. సమస్య పరిష్కారినికి ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకొని ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అలాగే కొండారెడ్డి బురుజు వద్ద పార్కు, కొత్త బస్టాండ్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న మురుగు కాల్వల పనులను కమిషనర్ పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, డీఈఈ గంగాధర్ ఉన్నారు.

మహోన్నతమైనది భారత రాజ్యాంగం

కర్నూలు (టౌన్): భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదని, ప్రజాస్వామ్య పరిరక్షణకు మూల స్తంభం అని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉద్యోగులచే కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు.

షూటింగ్ పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): బీహార్ రాష్ట్రంలోని గయా పట్టణంలో ఈనెల 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న 43వ జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో క్రీడాకారులు రాణించాలని న్యాయవాది శ్రీధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. రాష్ట్ర షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి పరుశరాముడు, చిన్న సుంకన్న పాల్గొన్నారు.

ఉషూలో సత్తా చాటాలి

పంజాబ్ రాష్ట్రంలోని అమృత్ సర్‌లో ఈ నెల 29 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు నిర్వహించనున్న 22వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఉషూ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ సూచించారు. జాతీయ పోటీల్లో పాల్గొనే పవన్, జాద్‌బాషా, సాద్ బాషాలను ఆయన అభినందించారు. ఉషూ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఉన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కర్నూలు(రూరల్) : జిల్లా కేంద్రం కర్నూలు సమీపాన వెలసిన వెంకాయ పల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూకట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ తదియితర పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తికమాసం నేపథ్యంలో మహిళలు నాగులకట్ట దగ్గర దీపలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. నూతనవధూవరులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమర్జెన్సీ బర్న్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ



శిక్షణ పొందిన వారిని అభినందిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కాలిన గాయాల రోగుల నిర్వహణకు ఇద్దరికి శిక్షణ ఇచ్చారు. న్యూఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్టివ్, బర్న్స్ సర్జరీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ బ్లాక్ ద్వారా ఎంఎన్ఓ రాజశేఖర్, ఎఫ్ఎన్ఓ జయమ్మ ఎమర్జెన్సీ బర్న్ మేనేజ్‌మెంట్ శిక్షణ పొందారు. వీరిని మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు అభినందించారు. ఆసుపత్రిలో ట్రామా, బర్న్ గాయాల నివారణకు ఇలాంటి శిక్షణ పొందడం ద్వారా రోగులకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ప్లాస్టిక్ సర్జరీ హెచ్ఓడి డాక్టర్ మంజులబాయి ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



శ్యాంపిల్స్ సేకరిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు డీఈ రవీందర్‌రెడ్డి, ఏఈ విజయభాస్కర్ పరిశీలించారు. నాణ్యతను పరిశీలించేందుకు శాంపిల్స్‌ను సేకరించారు. వారి వెంట మండల ఇంజినీర్ ముక్తార్ బాషా ఉన్నారు.

సామాజిక వనరులపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధి కూలీలు

కల్లూరు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద వివిధ పనుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్దటేకూరు, బస్తిపాడు గ్రామాల్లో సామాజిక వనరులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఓ మద్దేశ్వరమ్మ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉలిందకొండ గ్రామంలో పెద్ద చెరువు దగ్గర భారత రాజ్యాంగ దినోత్స వేడుకలు నిర్వహించారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈపీ మధుసూదనరావు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.